రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:29 (బుధవారం సాయంత్రం)
సహర్ 5:01 (గురువారం ఉదయం)

• ఫటాఫట్

పౌష్టికాహారం.. నాణ్య మైన విద్యను అందిస్తున్నాం

- ఐసీడీఎస్ సీడీపీవో సబిత

ఆంధ్రజ్యోతి: కరీంనగర్ అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్ వాడీ కేంద్రాలు ఎలా కొనసాగుతు న్నాయి.



సీడీపీవో: మూడు మండలాల్లో ఉన్న 172 అంగన్వాడీ సెంటర్లు చాలా బాగా నడుస్తున్నాయి. వీటిలో 24,094 మంది చిన్నారులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: గర్భిణులకు చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారా?

సీడీపీవో: గర్భిణులకు చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించడంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నాము. కో లోకేటెడ్ అంగన్వాడీ కేంద్రాల్లోని మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకి యూనిఫామ్స్ ఇచ్చాము.

ఆంధ్రజ్యోతి: ప్రాజెక్టు పరిధిలో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి?

సీడీపీవో: ప్రాజెక్టు పరిధిలో 17 టీచరు పోస్టులు 25 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: అంగన్వాడీ కేంద్రాల్లో ఏయే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సీడీపీవో: కలెక్టర్ సహకారంతో శుక్రవారం సభ, ప్రతినెలా నిర్వహించే కమ్యూనిటీ బేస్డ్ యాక్టివిటీస్ నిర్వహిస్తున్నాం.

- గణేశ్‌నగర్ (ఆంధ్రజ్యోతి)



- ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ
- పరీక్షలు రాయనున్న 12,516 మంది విద్యార్థులు
- 21 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కరీంనగర్ టౌన్, మార్చి 18: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఈనెల 21 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ఏప్రిల్ 2న ముగియనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 12,516 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 6,618 మంది బాలురు, 5,898 మంది బాలికలు ఉండగా, 23 మంది ప్రైవేట్‌గా పరీక్షలు రాస్తున్నారు.

• 73 పరీక్షా కేంద్రాలు

జిల్లావ్యాప్తంగా 73 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి ఒకరు చొప్పున 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 73 మంది డిపార్టుమెంట్ అధికారులు, 73 మంది అదనపు డిపార్టుమెంట్ అధికారులను నియమించారు. వారి పర్యవేక్షణలో జరిగే పరీక్షలకు 694 మందిని ఇన్విజిలేటర్లను నియమించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను అరగంట ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

పరీక్షా కేంద్రాలకు సమయానికి అరగంట ముందే చేరుకొని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలులో ఉంటుంది. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. డ్యుయల్ డెస్క్‌లు, తాగునీరు, గాలి వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్యసిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు, అదనపు డిపార్టుమెంట్ అధికారుల పర్యవేక్షణతోపాటు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

● హాల్ టికెట్‌ను విద్యార్థి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం

కలెక్టర్ అధ్యక్షతన పదో తరగతి పరీక్షల నిర్వహణపై మూడుసార్లు సమావేశాన్ని నిర్వహించి విద్య, రెవెన్యూ, పోలీసు, వైద్యశాఖ అధికారులకు మార్గదర్శనం చేయడంతో ఆయాశాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశాయి. జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి విద్యార్థి స్వయంగా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థి పుట్టిన తేదీ, ఆధార్‌కార్డు నంబర్ నమోదు చేసి హాల్ టికెట్ వస్తుంది. ఇందుకు సంబంధించి డీఈవో కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఏమైనా సమస్యలుంటే డెస్క్‌ను సంప్రదించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌వీఎస్ జనార్ధన్‌రావు తెలిపారు. ఈ యేడు వంద శాతం ఫలితాలను సాధించే విధంగా పక్కా ముందస్తు ప్రణాళికతో విద్యాబోధన చేయడంతోపాటు నిపుణులతో సబ్జెక్టులవారిగా విద్యార్థుల సందేహాలను కూడా నివృత్తి చేశామని అన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులను పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించబోమన్నారు. హాల్ టికెట్, ప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్ షార్ప్‌నర్, ఎరేజర్, జామెట్రీ పరికరాలను మాత్రమే తీసుకు వెళ్లవచ్చని చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో నలుగురు డీబార్

కరీంనగర్ టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2 పరీక్షల్లో నలుగురు విద్యార్థులు కాపీయింగ్ చేస్తుండగా పట్టుకొని మాల్‌ప్రాక్టిస్ కేసు బుక్ చేసి డీబార్ చేసినట్లు పరీక్షల జిల్లా కన్వీనర్, డిఐఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నిర్వహించిన పరీక్షలకు 402మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్, వొకేషనల్ విభాగంలో కలిపి 15,965 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా జనరల్ విభాగంలో 314, వొకేషనల్‌లో 88, మొత్తం 402 మంది పరీక్షలకు హాజరుకాలేదు. జనరల్ విభాగంలో 14,289, వొకేషనల్‌లో 1,274, మొత్తం 15,563 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 26 కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని ముకరంపుర ఎస్ఆర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఒకరు, వావిలాలపల్లి అల్ఫోర్స్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ముగ్గురు కాపీయింగ్ చేస్తుండగా పట్టుకుని మొత్తం నలుగురిని డీబార్ చేసినట్లు తెలిపారు.

కనీస పెన్షన్ రూ. ఐదు వేలకు పెంచాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ కనీస పెన్షన్ ఐదు వేల రూపాయలకు పెంచాలని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పుల సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. పెన్షన్ పెంచడంతోపాటు దానికి కరువు భత్యం జోడించాలని, ఈపీఎఫ్ కనీస పరిమితిని 15 వేల నుంచి 30 వేలకు పెంచాలన్నారు. ఈఎస్ఐ కనీస పరిమితి 21 వేల నుంచి 42 వేలకు పెంచాలని, ప్రభుత్వ ఆస్తుల విక్రయాలపై తక్షణమే నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. బీమా రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడులను నిషేధించాలని, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనం ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్ మాట్లాడుతూ కార్మిక సంక్షేమం విస్మరించే ప్రభుత్వాలు మనుగడ ఉండబోదన్నారు. కార్యక్రమంలో కర్ణకంటి సత్యం, తాటికొండ తిరుపతి, మొగిలిపాలెం తిరుపతి, వైద్యుల రమణయ్య, మాడిశెట్టి గంగాధర్, నక్క అరుణ్, కరుణాకర్, మహేందర్‌రాజు పాల్గొన్నారు.

అర్హులకు అందని కిసాన్ సమ్మాన్
● ఏడేళ్లుగా ఎదురు చూస్తున్న రైతులు 6లో..

అన్ని మున్సిపాలిటీల్లో వడ్డీ మాఫీ చేయాలి
● బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ 8లో..

రేపటి నుంచి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఎంపిక పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో 20,21 తేదీల్లో కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా యువకులు, కళాశాల విద్యార్థులకు వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన మొదటి పది మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లా స్థాయి ఎంపికలకు యూనివర్సిటీ వైస్‌చాన్సలర్, అధికారులు, సోషల్ యాక్టివిస్టులు జ్యూరీ మెంబర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రతి విద్యార్థికి మూడునిమిషాలపాటు వన్ నేషన్ - వన్ ఎలక్షన్.. పేమెంట్ టు ది డెవలప్‌మెంట్ అనే శీర్షికపైన మాట్లాడే అవకాశం ఇస్తామన్నారు. ఈ ఎంపిక ద్వారా విద్యార్థులు అసెంబ్లీకి, పార్లమెంట్‌కి నేరుగా వెళ్లి మాట్లాడే అవకాశం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌వైకే డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎలిజబెత్ రాణి, డాక్టర్ కాంపల్లి అర్జున్, డాక్టర్ పడాల తిరుపతి, డాక్టర్ రాజేశం, డాక్టర్ రాపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్తపల్లి స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ



కొత్తపల్లి ఠాణాను తనిఖీ చేసిన పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమీషనరేట్ పరిధిలోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలు అడిగితెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడారు. వారికి కేటాయించి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్‌లో పొందుపరచాలన్నారు. పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. కేసుల పెండింగ్‌కు కారణాలు తెలుసుకున్నారు. త్వరగా వాటిని పూర్తి చేయా లని అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సైబర్ నేరాల గురించి తెలుసుకున్నారు. అర్బన్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు పోలీసు అధికారులను కేటాయించాలని ఆదేశించారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు సీపీ పలు సూచనలు చేశారు. అన్ని రకాల విధులను సక్రమంగా నేర్చుకోవాలన్నారు. రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షను, కోర్టు డ్యూటీ, డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్లు మొదలుగు విధులను సీనియర్ల ద్వారా తెలుసుకోవాలన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరని తెలిపారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణలో భాగంగా ట్రైనీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి కొత్తపల్లి పోలీసురాణా ఎస్‌హెచ్‌వోగా మూడు నెలల పాటు కొనసాగనున్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి పోలీసురాణా ఎస్‌హెచ్‌వోగా ప్రొబెషనరీ ఐపీఎస్ వసుంధర ఫౌరెబి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై ఉద్యోగులకు అవగాహన

గణేశ్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ మేక రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు అన్ని రకాల భద్రత పరికరాలు అందజేస్తూ పలు సూచనలు జారీ చేశామన్నారు. సెక్షన్ ఇన్‌చార్జి ప్రతిరోజూ పనికి ముందు 15 నిమిషాలు భద్రతా చర్యల గురించి సిబ్బందితో చర్చించాలని ఆదేశించామన్నారు. అనుమతి కలిగిన అధికారి తగిన జాగ్రత్తలు తీసుకుని మాత్రమే లైన్ క్లియర్ ఇవ్వాలని, ఫోన్ ద్వారా లైన్ క్లియర్లను ఇవ్వడాన్ని నివారించాలని సూచించామన్నారు. మెయింటెనెన్స్/అవుట్ వర్క్స్ జరుగుతున్న ప్రాంతాలను సెక్షన్ ఆఫీసర్/ఏడీఈ ఆకస్మిక తనిఖీ చేయాలన్నారు. భద్రతా ప్రక్రియలో ఏదైనా ఉల్లంఘన ఉన్నట్లు గుర్తించినట్లయితే చర్యలను తీసుకోవాలని ఆదేశించామని తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు సమష్టి కృషి అవసరమని చెప్పారు.

టాస్క్‌ఫోర్స్ ఏసీపీ నరేందర్‌కు అదనపు ఎస్పీగా పదోన్నతి



గోపతి నరేందర్

కరీంనగర్ క్రైం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న గోపతి నరేందర్‌కు అదనపు ఎస్పీ(నాన్‌క్యాడర్)గా పదోన్నతి పొందారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 15 మందికి అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గోపతి నరేందర్ కరీంనగర్ టౌన్ ఏసీపీగా పనిచేస్తూ ఇటీవల టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఆయన కరీంనగర్‌లోని అన్ని పోలీసు స్టేషన్లలో సీఐగా పనిచేశారు. అదనపు ఎస్పీగా పదోన్నతిపొందిన నరేందర్‌కు పలువురు పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు. గతంలో కరీంనగర్ జిల్లాలో దీర్ఘకాలం పనిచేసి, ప్రస్తుతం నిజామాబాద్ స్పెషల్ బ్రాంచి ఏసీపీగాగా విధులు నిర్వహిస్తున్న సుందరగిరి శ్రీనివాసరావుకు అదనపు ఎస్పీగా పదోన్నతి లభించింది. పదోన్నతులు పొందిన ఏసీపీలను డీజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.



• నోరూరించే వివిధ రకాల వంటకాలు



హరీస్‌ను సిద్ధం చేస్తున్న నిర్వాహకుడు అహ్మద్

నోరూరిస్తున్న రంజాన్ రుచులు

రంజాన్ వచ్చేసింది. కరీంనగర్‌లో రంజాన్ ప్రత్యేక స్టాళ్లు వెలిశాయి. నోరూరించే వంటకాలతో ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. నిర్వాహకులు రంజాన్ ప్రత్యేక వంటకమైన హలీమ్, హరీస్‌ను తయారు చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నారు. పలు రకాల స్వీట్లను తయారు చేస్తున్నారు. అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ ఉందని స్టాళ్ల నిర్వాహకులు తెలుపుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



• అమ్మకానికి సిద్ధంగా ఉంచిన చికెన్



పాయ



డబల్‌కా మీటా, ఖుబానీకా మీటా



రుమాలీ రోటీ తయారు చేస్తున్న కుక్

చికిత్స పొందుతూ రిటైర్డు కార్మికుడి మృతి

పెద్దపల్లి రూరల్ , మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన జన్నపు రాజిరెడ్డి (72)ని కుటుంబ సభ్యులు రాఘవపూర్‌లోని రెడ్డి సంక్షేమ వృద్ధుల ఆశ్రమంలో పదినెలల క్రితం చేర్పించారు. అప్పటి నుంచి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో సోమవారం ఆశ్రమంలో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వార్డెన్ గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

భర్త, అత్తమామలపై అదనపు కట్నం కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధించిన ఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లోని చీకట్ల శ్రీకాంత్, అతడి తల్లిదండ్రులు ఎల్లవ్వ, రాజయ్యలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండలంలోని అక్కపల్లి గ్రామానికి చెందిన రాధికకు మూడేళ్ల క్రితం హరిదాస్‌నగర్‌లోని శ్రీకాంత్‌తో వివాహమైంది. ఆ సమయంలో పుట్టింటి వారు రూ.11 లక్షల నగదు, తులం బంగారం ఇచ్చి పెళ్లి జరిపించారు. ఏడాది కాలంగా రాధికను భర్త, అత్తమామలు రూ.లక్ష అదనంగా కట్నం తీసుకు రావాలని వేధిస్తున్నారంటూ బాధితురాలు రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

ఇటలీలో రోడ్డు ప్రమాదం : ఒకరి మృతి

- 38 రోజుల అనంతరం ఇంటికి చేరిన మృతదేహం


రషీద్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలో అద్దెకు ఉంటున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వ్యక్తి రషీద్(42) ఇటలీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడని స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహం మంగళవారం సిద్ధిపేటకు చేరుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. రషీద్ మూడు నెలల కిందట ఇటలీకి వెళ్లి ట్రక్కు డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఫిబ్రవరి 12న లిథువేనియా నుంచి ఇటలీకి ట్రక్కుతో బయలుదేరాడు. వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి దాటుతున్న క్రమంలో మరో భారీ వాహనం ఢీకొట్టింది. దాంతో తీవ్ర గాయాలపాలైన రషీద్ మృతిచెందాడు. 38 రోజుల అనంతరం ఆయన మృతదేహం ఇంటికి చేరింది. ఎల్లారెడ్డిపేట నుంచి బంధువులు సిద్ధిపేటకు బయలుదేరి వెళ్లారు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలు, సోదరులు, సోదరి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లంతకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందికట్కూర్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బొలుమాల శ్రీనివాస్, ఎలుక దీపికలకు గాయాలయ్యాయి. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్, దీపిక తదితరులు కందికట్కూర్ గ్రామంలో జరిగే వారసంతలో కూరగాయలు అమ్మడానికి మంగళవారం ఆటోలో బయలుదేరారు. ఎదురుగా కట్టెల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడగా, సిరిసిల్ల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నకిలీ ధ్రువపత్రాల కేసులో ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్య ధ్రువీకరణ పత్రాల కేసులో కత్తి దేవమ్మ, జేరిపోతుల సంజీవ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గాలిపెల్లి గ్రామంలోని పశువైద్యశాలలో ఓఎస్‌గా పనిచేస్తున్న దేవమ్మ కూతురుకు ఉద్యోగం ఇప్పించాలనే ఆలోచనతో మెడికల్ ఇన్‌వాలిడేషన్ సర్టిఫికెట్ కావాలని సంజీవ్‌ను కోరింది. సంజీవ్ రూ.32వేలు తీసుకొని రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగి విక్కుర్తి కనుకయ్య సహాయంతో కరీంనగర్‌లోని సన్‌షైన్ ఆసుపత్రి పేరుతో నకిలీ వైద్యపత్రాలు తయారుచేసి ఇచ్చారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో దేవమ్మ కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంది. కలెక్టర్ సర్టిఫికెట్లపై విచారణకు ఆదేశించగా నకిలీవని తేలింది. గాలిపెల్లి పశువైద్యాధికారిణి కొండ ఇందిర ఫిర్యాదు మేరకు దేవమ్మ, సంజీవ్‌లను మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

జగిత్యాల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఒకరికి ఏడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.15వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన అడువాల నాగరాజు 2017 సంవత్సరంలో అదే మండలంలోని ఓ గ్రామంలో ఒంటరిగా ఉన్న ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు బెదిరింపులకు గురి చేశాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి నాగరాజుకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి

జగిత్యాల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అల్లకొండ రాజవ్వ(70) అనే వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. జగిత్యాల పట్టణంలోని చిలుకవాడకు చెందిన రాజవ్వ ఈ నెల 10న తన ఇంటి నుంచి బయటకి వెళ్లి ప్రధాన రహదారి దాటుతుండగా ఓ కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వృద్ధురాలికి తీవ్ర గాయాలు కాగా జగిత్యాల ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. తొమ్మిది రోజుల అనంతరం మృతి చెందింది. ప్రమాదానికి కారకుడైన కారు నడిపిన సాయి వివేక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

జగిత్యాలరూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన మతలాపురం రాజం (55) అనే రైతు అప్పుల బాధతో మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. సాగుకు, ఇంటి అవసరాలకు రూ.10 లక్షల వరకు అప్పులు కావడంతో వాటిని తీర్చలేక నిత్యం తీవ్ర మనస్తాపం చెందేవాడు. మంగళవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంగళసూత్రం అపహరణ

మెట్‌పల్లి రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ అమ్మ వారి దర్శనానికి వచ్చిన మహిళ మెడలోంచి అగంతకుడు బైక్‌పై వచ్చి వెనుక నుంచి మంగళసూత్రాన్ని అపహరించాడు. మంగళవారం నిర్మల్ జిల్లా మునిపల్లి మండలంలోని లక్ష్మణచంద గ్రామానికి చెందిన దొండ రమ్య భర్త, కొడుకుతో కలిసి వెల్లుల్ల ఎల్లమ్మ ఆలయానికి దర్శనానికి మంగళవారం వచ్చారు. దర్శనం అనంతరం వంట చేసుకుని తన కొడుకుకు తినిపిస్తుండగా బైక్‌పై వచ్చిన అగంతకుడు కొంత దూరంలో ఆపి నడుచుకుంటూ వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడును తెంచుకుని వెళ్లాడు. ఎస్సై కిరణ్‌కుమార్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్హులకు అందని కిసాన్ సమ్మాన్

ఏడేళ్లుగా ఎదురు చూస్తున్న రైతులు



హుజూరాబాద్‌రూరల్, మార్చి 1 8(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయం ఉన్నా కేంద్రం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన (పీఎం కేఎస్‌వై) ప్రారంభించింది. ఎంత భూమి ఉన్నా పట్టాదారు పుస్తకం ఉన్న వారికి ఏడాదికి మూడు విడతల్లో కలిపి రూ. 6 వేలు ఖాతాల్లో జమ చేస్తోంది. 2019 ఫిబ్రవరి 1 వరకు కటాఫ్ విధిం చింది. అప్పట్నుంచి కొత్తగా భూములు కొన్న, వారసత్వంగా పొందిన అన్నదాతలకు ఈ పథకం వర్తించడం లేదు. 2018లో భూ ప్రక్షాళన అయ్యాక కొందరి భూములు మిస్సింగ్ పడడంతో తగిన ఆధారాలు చూపి పట్టాదారు పాసు పుస్తకాలు పొందారు. వీరికి కిసాన్ సమ్మాన్ యోజన వర్తించడం లేదు.

కటాఫ్ తేదీలో వర్తించని పథకం

ఈ ఏడాదికి సంబంధించి మొదటి విడత కింద కేంద్రం ఫిబ్రవరిలో మండలంలో 9,282 మంది రైతులకు 55,692,000 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. కొత్త వారు మాత్రం ఏడేళ్లుగా నష్ట పోతున్నారు. కటాఫ్ తేదీని తొలగించి పెట్టుబడి సాయం అందిస్తామని ఇటీవల ఓ కేంద్రమంత్రి ప్రకటించిండంతో పథకానికి దరఖాస్తు చేసుకున్న రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మండలంలోని 19 గ్రామ పంచా యతీల్లో కొత్తగా పట్టాదారు పుస్తకాలు పొందిన, భూ మార్పిడి చేసుకున్న వారు ఉన్నారు. 1,322 మంది పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కోసం దరఖాస్తు చేసుకో గా 430 మంది రైతులు అర్హులుగా వ్యవసాయాధి కారులు గుర్తించారు. ఈ మేరకు రైతు వేదికల్లో వ్యవ సాయ విస్తీర్ణాధికారులతో అవగాహన కల్పించారు. ఏఈవోల ద్వారా లేదంటే మీ సేవ కామన్ సర్వీస్ సెంటర్లలో నమోదు చేసుకుంటే సాయం అందు తుందని తెలిపారు.

PM KISAN SAMMAN NIDHI
Department of Agriculture and Farmers Welfare
Ministry of Agriculture and Farmers Welfare
Government of India

PM KISAN YOJANA

ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తేనే..

చాడ భూమిరెడ్డి, ఏవో, హుజూరాబాద్



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి మండలంలో అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన జరిగింది. రైతులు ఆందోళన చెందొద్దు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తే అర్హులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తింపచేస్తాం.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బోయినపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని రాస్తారోకో చేపట్టారు. ఈ సంఘటన బోయినపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం.. గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన మల్లేశం(42) బోయినపల్లిలో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి గొర్రెల మంద వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువులు బోయినపల్లి రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. వాహన డ్రైవర్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ మృతుడి కుటుంబ సభ్యులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి ఆరు నెలల జైలు

జగిత్యాల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అజాగ్రత్తగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన ఒకరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.9వేల జరిమానా, గాయపడిన బాధితులకు రూ.30 వేల పరిహారం చెల్లించాలంటూ జగిత్యాల కోర్టు రెండవ అదనపు జ్యుడీషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన పోతర్ల రవి 2019 మే 15న తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వేములవాడ నుంచి కొడిమ్యాల వైపు వస్తున్నాడు. మ్యాకల అంజయ్య అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తగా, అతి వేగంగా నడుపుతూ నల్లగొండ శ్రీలక్ష్మి నృసింహస్వామి ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న రవి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో రవితో పాటు అతని కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి కొడిమ్యాల ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజని కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి మ్యాకల అంజయ్యకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఆస్తి కోసం అమ్మమ్మను చంపిన దత్తపుత్రుడు

- వెంకటమ్మ హత్య కేసులో వీడిన మిస్టరీ.. నిందితుడి అరెస్టు
- ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్

కరీంనగర్ క్రైం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కొత్తపల్లి శివారులో కెనాల్ వద్ద ఈ నెల 15న జరిగిన వృద్ధురాలి హత్య కేసులో నిందితుడు ఆమె దత్తత తీసుకున్న మనువడేనని, ఆస్తి కోసం హత్య చేసినట్లు విచారణలో తేలిందని కరీంనగర్ ట్రైనీ ఐపీఎస్, కొత్తపల్లి ఎస్‌హెచ్‌వో వసుంధర యాదవ్ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌కు చెందిన వృద్ధురాలు తనుకు వెంకటమ్మ(70)కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురు కుమారుడు చంద్రశేఖర్‌ను దత్తత తీసుకొని వివాహం చేసింది. వెంకటమ్మ వద్ద ఉన్న బంగారం, డబ్బులు కూతుళ్లకు ఇస్తుందని, తనకు ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని చంద్రశేఖర్ తరచూ ఆమెతో గొడవపడేవాడు. వెంకటమ్మతో గొడవపడిన చంద్రశేఖర్ ఏడాది కాలంగా కరీంనగర్‌లో భార్యతో కలిసి ఉంటున్నాడు. ఎలాగైనా వెంకటమ్మను చంపాలని, తద్వారా ఆమె పేరిట ఉన్న ఆస్తి అంతా తనకు చెందుతుందని భావించాడు.ఈ నెల 15న వెంకటమ్మ కోహెడ మండలం రాంచంద్రాపూర్‌లో తన పెద్ద కూతురు లక్ష్మి వద్ద ఉండగా చంద్రశేఖర్(దత్తపుత్రుడు) ఆమెకు ఫోన్ చేశాడు. ఎల్ఐసీ డబ్బులు తీసుకునేందుకు కరీంనగర్‌కు రావాలని సూచించాడు. వెంకటమ్మ కరీంనగర్ బస్టాండ్‌కు రాగానే చంద్రశేఖర్ పథకంలో భాగంగా అప్పటికే స్నేహితుడి కారుతో సిద్ధంగా ఉన్నాడు. జగిత్యాల ఎల్ఐసీ కార్యాలయంలో డబ్బులు తీసుకుందామని నమ్మబలికి వెంకటమ్మను తీసుకువెళ్లాడు. అక్కడ సాయంత్రం వరకు గడిపి అధికారులు అందుబాటులో లేరని చెప్పి తిరిగి కరీంనగర్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో కొత్తపల్లి శివారులో అదను చూసి వెంకటమ్మపై కత్తితో దాడి చేయడంతో తీవ్రరక్తస్రావంతో ఆమె మరణించింది. చంద్రశేఖర్‌ను అనుమానించిన పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం రాత్రి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.


ఘటన స్థలంలో పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్

డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి లబ్ధిదారులు

ఇల్లంతకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తమను ఎంపిక చేసినా కేటాయించకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లలో చేరిపోయారు. గత ప్రభుత్వం మండల కేంద్రంలో 40డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించింది. పలుసార్లు గ్రామసభలు నిర్వహించి రెండు సంవత్సరాల క్రితం లబ్ధిదారులను ఎంపిక చేశారు. అప్పటి నుంచి రోడ్డు సౌకర్యం లేదని, ఇతర వసతులు లేవని పంపిణీ చేయడం లేదు. నిర్మాణం జరిగిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని అధికారులు గదులకు తాళాలు వేసి వచ్చారు. అధికారులు ఇళ్లను కేటాయించకపోవడంతో అసహనం చెందిన 10మంది లబ్ధిదారులు మంగళవారం గదులకు వేసిన తాళాలను పగలగొట్టి తమ సామగ్రిని ఇళ్లలో ఉంచి తాళాలు వేసుకొని వచ్చారు. అద్దె ఇళ్లలో తాము ఇబ్బందులు పడుతున్నందున ఇలా చేయవలసి వచ్చిందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మిగతా లబ్ధిదారులు డబుల్‌బెడ్‌రూం ఇళ్లలోకి పోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ లేదు. రోడ్డును ఇటీవలే పూర్తిచేశారు.


డబుల్‌బెడ్‌రూంలలో ఉన్న లబ్ధిదారులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అజయ్‌కుమార్ (ఫైల్)

చిట్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీపురం తండా ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ (24) వ్యక్తిగత పని నిమిత్తం భూపాలపల్లికి బయల్దేరాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అజయ్ కుమార్ అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. మృతుడి తండ్రి వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


అజయ్ (ఫైల్)

పాలకుర్తి,మార్చి 18(ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్‌లోని వాహరుతినగర్‌కు చెందిన ఆరె అజయ్ (24) అనే యువకుడు మంగళవారం సాయంత్రం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యం బారినపడడంతో తనకు ఏదో అంతు చిక్కని వ్యాధి సోకిందని అభద్రతభావానికి గురయ్యేవాడు. మనస్తాపంతో ఉరివేసుకొన్నాడని, మృతుడి తండ్రి ఆరె లక్ష్మన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇల్లందకుంట వాసికి రాష్ట్ర స్థాయి 35వ ర్యాంక్


పరుశురామ్

ఇల్లందకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన బీనవేన పరుశురామ్ గ్రేడ్-2 హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సోమవారం విడుదల చేసిన గ్రేడ్-2 హాస్టల్ వేల్ఫేర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 35వ ర్యాంక్ సాధించి హాస్టల్ వార్డెన్ అధికారిగా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పరుశురామ్‌ది పేద రైతు కుటుంబం. చిన్ననాటి నుంచి కష్టపడి చదివి 2023లో పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం పరుశురామ్ కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి


ప్రజ్ఞాన్ (ఫైల్)

సైదాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని బొమ్మకల్ గ్రామంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మకల్ గ్రామానికి చెందిన ఎలబోయిన చైతన్య-సురేష్ దంపతులకు ప్రజ్ఞాన్ (2) ఒక్కగానొక్క కుమారుడున్నాడు. మంగళవారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటూ ప్రజ్ఞాన్ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయాడు. ప్రజ్ఞాన్ కనబడడం లేదని కుటుంబ సభ్యులు వెతుకగా, నీటి సంపులో పడి కనిపించాడు. వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం హుజూరాబాద్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

పాఠశాల ఆవరణలో మద్యం సేవించిన సర్వీస్ పర్సన్ తొలగింపు

చందుర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆవరణలో ఓ పదో తరగతి విద్యార్థితో మద్యం సేవించిన సర్వీస్ పర్సన్‌ను విధుల నుంచి తొలగించారు. ఈ సంఘటన చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వీస్ పర్సన్‌గా పనిచేస్తున్న బండి రాకేష్ పదో తరగతి విద్యార్థితో కలిసి పాఠశాల ఆవరణలో ఎవరూలేని సమయంలో మద్యం సేవిస్తూ, విద్యార్థులను దురలవాట్లకు పురిగొల్పుతున్న విషయం జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు దృష్టికి వెళ్లింది. దీంతో వెంటనే స్పందించిన డీఈవో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జితేందర్‌తో మాట్లాడి సర్వీస్ పర్సన్‌ను తొలగించాలని మౌఖికంగా ఆదేశాలు చేశారు. దీంతో డీఈవో ఆదేశాల మేరకు సర్వీస్ పర్సన్‌ను విధుల నుంచి తొలగించినట్లు మండల విద్యాధికారి వినయ్ కుమార్ తెలిపారు.

మండలాల పునర్విభజన తెచ్చిన తంటా



- ఇబ్బందులు పడుతున్న మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండెడ గ్రామాల ప్రజలు
- ఎండపల్లి మండలంలో రెవెన్యూ సేవలు
- పోలీస్‌స్టేషన్ పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లో..
- వెల్గటూర్ మండలంలో వైద్య సేవలు

ఎండపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలాల పునర్విభజనతో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండెడ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు వివిధ రకాల సేవల కోసం మూడు ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు గ్రామాల రెవెన్యూ సేవలు ఎండపల్లి మండలంలో, వైద్య సేవలు వెల్గటూర్ మండలంలో, పోలీస్ సేవలు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలో కొనసాగుతున్నాయి. మూడు గ్రామాలు గతంలో వెల్గటూర్ మండలంలో ఉండేవి. 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పాలకుర్తి గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేసి మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండెడా గ్రామాలను అందులో విలీనం చేసింది. 2022లో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం తెరపైకి వచ్చింది. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని 12 గ్రామాలు, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని మూడు గ్రామాలతో నూతన మండలం ఏర్పడింది. దీంతో రెవెన్యూ, వైద్య, పోలీస్ మూడు కార్యాలయాలు మూడు దిక్కులు అయ్యాయి. మండలం ఏర్పడి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు పూర్తి కార్యాలయాలు ఏర్పడలేదు. దీంతో మూడు గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎండపల్లి మండలానికి కొత్త పోలీస్ స్టేషన్ మంజూరు అయ్యే వరకు వెల్గటూర్ స్టేషన్‌లోనైనా ఈ మూడు గ్రామాలను విలీనం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

పల్లె అశోక్, మాజీ సర్పంచ్, ముంజంపల్లి



మా గ్రామానికి సంబంధించి రెవెన్యూ, వైద్యం, పోలీసు శాఖలు మూడు మండలాల కలయికతో ఉన్నాయి. దీంతో గ్రామస్థులు వివిధ పనుల కోసం మూడు ప్రాంతాలకు వెళ్లలేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కొత్త మండలానికి పోతే మీ గ్రామం పాత మండలంలోనే ఉందని, పాత మండలానికి పోతే మీది కొత్త మండలంలో ఉందని అధికారులు చెప్పడంతో ఏమీ చేయలేక ఇక్కట్లు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు మా సమస్యను తొందరగా పరిష్కరించాలి.

మావి ఎటుకాని బతుకులు అయ్యాయి

కొమ్ము శ్రీకాంత్, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు



నూతన మండలం ఏర్పడినపుడు మా సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్నాం కాని ఇంకా పెరిగాయి. పోలీస్ స్టేషన్ పరిధిని బసంత్ నగర్ నుంచి మార్చి కొత్త స్టేషన్ ఏర్పడే వరకు వెల్గటూర్‌లోనైనా కలపండి. మావి ఇప్పుడు ఎటు కాని బతుకులు అయ్యాయి.

దేశం గర్వపడేలా క్రీడాకారులు ఎదగాలి

- హుజూరాబాద్‌లో టర్ఫ్ కోర్ట్ ఏర్పాటుకు కృషి
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్
- ముగిసిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు
- విజేతగా మెదక్.. రన్నరప్‌గా నిజామాబాద్ జట్టు



విజేతగా నిలిచిన మెదక్ జట్టుకు కప్‌ను అందజేస్తున్న వొడితెల ప్రణవ్, ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు దేశం గర్వపడేలా ఆటలు ఆడి ఎదగాలని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో మూడురోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ హుజూరాబాద్ వేదికగా అనేక రకాలన క్రీడా టోర్నమెంట్‌లు జరగాలన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో విద్యా, వైద్యంతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, మైదానాలకు సరిపడా నిధులు కేటాయిస్తామన్నారు. హుజూరాబాద్‌లో టర్ఫ్ కోర్ట్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో క్రీడలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. టోర్నమెంట్ నిర్వహించిన ఆర్గనైజింగ్ సెక్రెటరీ, క్లబ్ సభ్యులను అభినందించారు.

అనంతరం ఏసీపీ శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించు కోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. గెలుపొందిన జట్లకు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, ఏసీపీ శ్రీనివాస్‌జీ, ఆర్గనైజర్లు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హాకీ అసోసియేషన్ సెక్రటరీ భీమ్‌సింగ్, రాష్ట్ర హాకీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కళ్యాణి, జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రటరీ సురేందర్‌సింగ్, బి శ్రీనివాస్, తోట రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్, ఉమామహేశ్వర్, టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్, శ్రీనివాస్, పవన్, పీటీలు శ్యాంసుందర్, రవికుమార్, విశ్రాంత, రాజిరెడ్డి, ప్రభాకర్, తిరుపతి, సజ్జు, సాయికృష్ణ, రాకేష్, రాజేష్, విక్రమ్, సాంబరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

హుజూరాబాద్‌లోని హైస్కూల్ మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు చివరిరోజు హోరాహోరీగా సాగాయి. కరీంనగర్, మెదక్, హైద్రాబాద్, నిజామాబాద్ జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మొదటి సెమీ ఫైనల్స్‌లో కరీంనగర్‌పై మెదక్ 3-1తో విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. రెండో సెమిఫైనల్స్ హైద్రాబాద్‌పై నిజామాబాద్ 1-0తో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. థర్డ్ ప్లేస్ కోసం హైద్రాబాద్, కరీంనగర్ జట్లు తలపడగా ఇరుజట్లు చెరొక గోల్ చేయడంతో డ్రాగా ముగిసింది. ఎంపైర్లు స్ట్రోక్ ద్వారా విజేతను నిర్ణయించేందుకు ఇరుజట్ల కెప్టెన్లతో సంప్రదించి నిర్ణయం తీసుకున్నారు. హైద్రాబాద్‌లో 4గోల్స్ చేయగా, కరీంనగర్ 2 గోల్స్ చేయడంతో హైద్రాబాద్ గెలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో మెదక్- నిజామాబాద్ జట్లు పోటీపడగా 4-1తో మెదక్ విజయం సాధించి విజేతగా నిలిచింది. రన్నరప్‌గా నిజామాబాద్, మూడో స్థానంలో హైద్రాబాద్ సరిపెట్టుకుంది.

కొండగట్టులో టెండర్లు ఖరారు

మల్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో నిర్వహించే పలు దుకాణాలకు మంగళవారం నిర్వహించిన పలు టెండర్లు ఖరారు అయ్యాయి. ఏడాది కాల పరిమితితో హోటల్, ఫొటో స్టూడియో, సామాన్లు భద్రపరచుకునే హక్కు, స్నానాలు, మరుగుదొడ్లు, కిరాణం, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీం, చెప్పులు భద్రపరచడం, వంట చెరుకు అమ్మకం, పాదరక్షలు, టాయిలెట్స్ నిర్వహణకు ఈ-టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగవేలం నిర్వహించారు. ఈ వేలంలో హోటల్ నిర్వహణకు రూ.18.25లక్షలు, కిరాణ సామగ్రి రూ.12.15లక్షలు, కూల్‌డ్రింక్స్ రూ.16.50 లక్షలు, లాకర్‌రూం రూ.18లక్షలు, ఫొటో స్టూడియో రూ.22 లక్షలు, వంట చెరుకు రూ.80వేలు, పాద రక్షలకు రూ.9,99,999, మామిడి తోట నిర్వహణకు రూ.10వేలకు ఖరారు అయినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. అలాగే గుట్ట కింది దుకాణం-10కి రూ.56వేలు, దుకాణం-13కు రూ.55వేలు పలికినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహర నాథ్, చంద్రశేఖర్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.


ఓసీల్లోని పేదలకు 'రాజీవ్ యువ వికాస్' వర్తింపజేయాలి

ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పాలాడి రామారావు



మాట్లాడుతున్న పాలాడి రామారావు

కరీంనగర్ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అగ్రకులాలు (ఓసీ)ల్లో ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వర్తింపజేయాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో ఓసీ జేఏసీ నాయకులతో ఏర్పాటు చేసిన సమా వేశంలో మాట్లాడారు. ఓసీల్లోని పేదలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు విధివిధానాలను పాలకమండలిని ఇప్పటి వరకు ప్రకటించకపోవడం సరికాదన్నారు. నిరుద్యోగయువతకు ఆర్థిక సాధికారత లక్ష్యంగా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం హర్షనీయమన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఓసీ సామాజిక నిరుద్యోగ యువతకు వర్తింపజేయక పోవడం శోచనీయమన్నారు. జేఏసీ నాయకులు నర్సింహారెడ్డి, రాజిరెడ్డి, స్వామిరెడ్డి, తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, సంజీవరెడ్డి, రాజన్న, సమ్మిరెడ్డి, సంపత్‌రావు, గోపాల్‌రావు, సరోజనా జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



క్షయ నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- పెద్దపల్లి జిల్లాలో వంద రోజుల ప్రణాళిక
- గ్రామ గ్రామాన సర్వే, వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- ఉచితంగా మందుల పంపిణీ
- జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనలో పెద్దపల్లి జిల్లా ఎంపిక
- గర్రెపల్లి పీహెచ్‌సీ కేంద్రంగా కార్యాచరణ

సుల్తానాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసింది. వాటి పరిధిలో క్షయ రహిత జిల్లాలుగా తీర్చదిద్దడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లాను ఎంపిక చేసింది. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పీహెచ్‌సీ వేదికగా జిల్లాలో టీబీ నిర్మూలన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. టీబీ లేని జిల్లాగా మార్చడానికి చర్యలు ప్రారంభించారు. ప్రాణాంతకమైన క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు పీహెచ్‌సీలలో వంద రోజుల కార్యక్రమాన్ని అమలు చేసి క్షయ రహిత రాష్ట్రంగా చేయడానికి క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టింది. దేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి దేశ వ్యాప్తంగా 347 ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేసింది. తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది కేంద్రాలను సెలక్ట్ చేయగా అందులో పెద్దపల్లి జిల్లా ఉంది. అత్యధిక క్షయ రోగులు ఉన్న పెద్దపల్లి జిల్లాను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి వంద రోజుల ప్రణాళికను సిద్ధం చేశారు. వంద రోజులలో రోజు వారి ప్రణాళిక ప్రకారం అనుమానితులను గుర్తించడం, వారికి పరీక్షలు నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ అనంతరం అవసరమైన మందులను ఇస్తూ వాటిని క్రమం తప్పకుండా వాడేలా ప్రోత్సహించడం వంటి చర్యలను ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పర్యవేక్షిస్తున్నారు. మందులతో పాటు వారు పౌష్టికాహారం తీసుకునేలా చూడడం వీరి బాధ్యతే. క్రమం తప్పకుండా మందులు, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వంద రోజులలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.



గర్రెపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం

టీబీ రహిత రాష్ట్రంగా చేయాలి

వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరక్టర్ రాజేశం



టీబీని రాష్ట్రం నుంచి పారదోల డానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ క్షయ నిర్మూలన పథకం అమలు చేస్తుంది. రాష్ట్రంలో టీబీ కేసు లు లేకుండా చేయడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వంద రోజుల కార్యక్రమాన్ని గర్రెపల్లి పీహెచ్‌సీ కేంద్రంలో పారంభించారు. అన్ని పీహెచ్‌సీల పరిధిలో రోగులను గుర్తించి మందులు ఇస్తున్నాం. ఆకలి లేకపోవడం, సన్నబడడం జ్వరం రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ఏఎన్ఎంను ఆశాలను సంప్రదించాలి. రాష్ట్రంలోని పలు జిల్లాలను పరిశీలించిన అనంతరం పెద్దపల్లి జిల్లాను ఎంపిక చేశాం. దేశంలోనే టీబీ రోగులు అధికంగా ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ఇచ్చాయని, దాంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టి 2030కల్లా టీబీని నిర్మూలించేందుకు ప్రధానమంత్రి లక్ష్యంగా నిర్ణయించారు. అంతకన్నా ముందే లక్ష్యాన్ని చేరుతాము. క్షయ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయడానికి కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రామగుండం కేంద్రంలో రూ.25 లక్షలతో మొబైల్ ఎక్స్‌రే మిషన్ సమకూర్చారు. రోగులకు సౌలభ్యంగా వారి వద్దకే వెళ్లిఎక్స్‌రేలు తీస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి తోడు అభయ ఫౌండేషన్ వారు తమ సేవలను అందిస్తున్నారు. దాతలు సమకూర్చిన పౌష్టికాహారాన్ని ఆరు నెలల పాటు ఆయా పీహెచ్‌సీల పరిధిలో పంపిణీ చేస్తున్నారు.

లక్ష్యానికి మించి క్షయ పరీక్షలు

అన్నప్రసన్న కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి



జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పీహెచ్‌సీ కేంద్రంగా వ్యాధి నిర్మూలన చర్యలు చేపట్టాం. జిల్లాలో నిర్వహిస్తున్న నిక్షయ్ శివిర్ వంద రోజుల కార్యక్రమంలో హైరిస్కు జనాభాగా లక్షా 19 వేల 746 మందిని గుర్తించాం. లక్ష 22 వేల 421 మందికి టీబీ స్క్రీనింగ్ టెస్టులు చేశాం. వీరిలో 12 వేల 635 మందిని అనుమానితులుగా గుర్తించాం. జిల్లాలో మొత్తం 426 మందిని క్షయ వ్యాధిగ్రస్తులుగా గుర్తించాం. గతంలో ఉన్న 74 మందితో ప్రస్తుతం జిల్లాలో 500 మంది క్షయ రోగులు ఉన్నారు. జిల్లాలోని బేగంపేట ఆరోగ్య కేంద్రం పరిధిలో 25 మంది, ఎలిగేడ్‌లో 16, గద్దలపల్లిలో 83, గర్రెపల్లిలో 64, జూలపల్లిలో 25, కమాన్‌పూర్‌లో 31, కొలనూర్‌లో 3, నంది మేడారంలో 51, ముత్తారంలో 23, ఓదెలలో 20, రాఘవపూర్‌లో 42 మంది, రాగినేడులో 85 మంది, శ్రీరాంపూర్‌లో 23 మంది రోగులను గుర్తించి వారికి నెల నెలా మందులతోపాటు ఉచితంగా పౌష్టికాహారం కిట్లను అందిస్తున్నాము.



రోగులకు పంపిణీ చేసే కిట్లలోని సరుకులు

రూ.25 లక్షలతో పౌష్టికాహారం పంపిణీ


ఎస్ ఫణిశంకర్, రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ అసోసియేషన్ అధ్యక్షులు

రోగులు సత్వరంగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావడమే లక్ష్యంగా టీబీ వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని ప్రభుత్వం సూచించింది. ఈ పౌష్టికాహారాన్ని సమకూర్చడానికి తమ సంస్థ ద్వారా రూ.25 లక్షలను ఇచ్చాం. తద్వారా 3000 కిట్లను సమకూర్చి వాటిని అభయ ఫౌండేషన్ వారికి అప్పగించారు. వారు ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరు నెలల పాటు రోగులకు నెల నెలా పౌష్టికాహారాన్ని అందజేస్తారు. ఒక్కొక్క కిట్‌లో ఏడు వందల రూపాయల విలువ చేసి ప్రోటీన్ పౌడర్, దాంతో పాటు కొర్రలు, మంచి బియ్యం, పప్పులు, చక్కెర, నూనె వస్తువులు ఉంటాయి.

టీబీ సోకిన వారు జాగ్రత్తగా వ్యవహరించాలి : గర్రెపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్



క్షయ ప్రాణాంతకమైన వ్యాధి. పైగా అంటువ్యాధి కూడా. సరైన సమయంలో గుర్తించి కుటుంబ సభ్యులు దూరంగా ఉంటూ మందులు వాడుతూ బలమైన ఆహారాన్ని తీసుకోవాలి. తెమడ, ఎక్స్‌రే వంటి పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి ముదరక ముందు ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. గతంలో టీబీ వచ్చి తగ్గిన వారు మిగతా వారికి సహకరించాలి. రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలి. ఇతరులకు దగ్గరగా తుమ్మడం, దగ్గడం వంటివి చేయకూడదు. తుంపర్ల ద్వారా ఆ వ్యాధి ఇతర కుటుంబ సభ్యులకు సోకే ప్రమాదం ఉంది. ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయకూడదు.





పంపిణీకి సిద్ధం చేసిన కిట్లు

శివ కల్యాణం సందర్భంగా స్వామివారి పల్లకీ సేవ





పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఉద్యోగులు, అర్చకులు, దేవరాజు నాగార్జున్‌కు రాజన్న చిత్రపటం అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మూడో రోజు శివ కల్యాణోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి తీర్థరాజస్వామి పూజ, బలిహరణము నిర్వహించారు. స్వామి వారికి ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు నుంచి ఔపాసనము బలిహరణము రాత్రి 8.15 గంటలకు కల్యాణ మండపంలో సదస్యము, అనంతరం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు మట్టి పాత్రల్లో అమ్మవారికి నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా శివసత్తుల నృత్యాలతో అమ్మవారి ఆలయాన్ని చేరుకుని పట్నాలు, ఒడిబియ్యం, నూతన వస్త్రాలు సమర్పించారు.

రాజన్నను దర్శించుకున్న స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని రిటైర్డ్ జస్టిస్, స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ దేవరాజు నాగార్జున్ మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా ఆలయ అర్చకులు, వేద పండితులు స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొని కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో వినోద్ రెడ్డి రాజన్న చిత్రపటాన్ని అందజేశారు. వెంట ఏఈవో బ్రహ్మన్న గారి శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీకాంతచారి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నరేందర్ జూనియర్ అసిస్టెంట్ సంహాచారి ఉన్నారు.



బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

వేంకటేశ్వరుడి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు

ధర్మపురి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వేంకటేశ్వరస్వామి దక్షిణ, ఉత్తర దిగ్యాత్ర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామి వారల ఉత్సవమూర్తులను దక్షిణ దిశలో గల పోలీస్ స్టేషన్, ఉత్తర దిశలో గల ఉసిరిక వాగు వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి దంపతులు, ఎస్ఐ ఉదయ్‌కుమార్ దంపతులు, బుగ్గారం ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి దంపతులు, వెల్గటూర్, గొల్లపల్లి ఉమాసాగర్, సతీష్ దంపతులు, పోలీస్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపారు.

ఎనిమిదో రోజు ఆదాయం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయానికి రూ.3,88,685 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. వీటిలో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.2,94,168 ప్రసాదాల విక్రయం ద్వారా రూ.85,500 లభించాయి. అన్నదానం కోసం భక్తులు రూ.9,016 విరాళాలు సమర్పించినట్లు ఆయన వివరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, 3 గంటలకు రథోత్సవం ఉంటుంది. రాత్రి 7 గంటలకు చక్రతీర్థం, 9 గంటలకు స్వామివారల పుష్పయాగం ఉంటుంది. స్థానిక శేషప్ప కళా వేదికపై శ్రీరాంభట్టర్ భాగవతార్ హరికథ కాలక్షేపం ఉంటుందని ఈవో శ్రీనివాస్ తెలిపారు.

నరసింహుడి సన్నిధిలో ప్రముఖులు

లక్ష్మీ నరసింహస్వామి వారిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి సత్కరించారు. ఆయన వెంట ఎస్‌బీఐ డీజీఎం బిజయ్‌కుమార్ సాహు, గోదావరిఖని ఆర్ఎం రవీంద్రకుమార్, మంచిర్యాల ఆర్ఎం రితేష్‌కుమార్, ధర్మపురి బ్రాంచ్ మేనేజర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

- లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని కామినేని హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శశిధర్ కుటుంబ సమేతంగా మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిధర్ దేవాలయంలో జరిగే అన్నదానం కోసం రూ.1,00,000 విరాళాన్ని అందించారు.



వేంకటేశ్వరస్వామి వారల ఊరేగింపు సేవ

సైకిల్‌కు స్టీరింగ్



సైకిల్‌కు స్టీరింగ్ ఏర్పాటు చేసిన జాషువా

జగిత్యాల అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన కొండ జాషువా అనే 8వ తరగతి విద్యార్థి తన సైకిల్‌కు స్టీరింగ్ అమర్చాడు. ఇంట్లో ఉన్న ఓ పాత స్టీరింగ్ తీసుకుని బ్రేక్‌లు చేతులకు అనుకూలంగా ఉండేలా అమర్చాడు. సైకిల్‌కు బ్యాటరీ సైతం అమర్చి హారన్ పెట్టాడు. పట్టణంలోని రోడ్లపై స్టీరింగ్ సైకిల్‌తో హారన్ కొడుతూ తిరుగుతున్న సదరు బాలుడి సైకిల్‌ను జనాలు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ ఆలోచన ఎలా వచ్చిందని ప్రశ్నించగా ఇంట్లో పనికి రాకుండా ఉన్న పాత స్టీరింగ్ తీసుకుని స్నేహితుడి సహాయంతో సైకిల్‌కు స్టీరింగ్ అమర్చానని, నడపడానికి అనుకూలంగా ఉందని జాషువా తెలిపాడు.

కుక్కకాటుకు గురైన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలి

- గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి
- ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకుల ధర్నా

సిరిసిల్ల రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కుక్కకాటుకు గురైన విద్యార్థి సువర్ణకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు ఈ సంఘటనకు కారుకులైన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండెల్లి కళ్యాణ్‌కుమార్, మల్లారపు ప్రశాంత్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గురుకుల పాఠశాలను విద్యార్థిని తల్లిదండ్రులు డెవిడ్‌రాజు-కృపారాణిలతో కలిసి నాయకులు సందర్శించి పరిసరా లను పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రధాన ద్వారం ఎదుట మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటితో పాటు ఏబీవీపీ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నాయకులు ధర్నాలు చేశారు. ఈ సంద ర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గురు కుల పాఠశాలలోకి కుక్కలు వెళ్లి విద్యార్థులపై దాడిచేసి గాయ పర్చడం బాధాకరమన్నారు. కలెక్టర్ స్పందించి గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. కుక్క కాటుకు గురైన సువర్ణకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అసుపత్రిలో చికిత్స పొందుతున్న సువర్ణను ఎస్ఎఫ్ఐ నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్ కుమార్, నాయకులు రాకేష్, మనోఅభిషేక్, వినయ్ పాల్గొన్నారు.



చిన్నబోనాల గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏబీవీపీ అధ్వర్యంలో..

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గురుకుల పాఠశాలలో కుక్క కాటుకు గురైన విద్యార్థికి వైద్యం అందించడంతో పాటు అ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదు కోవడంతోపాటు నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్‌తో పాటు వాచ్‌మన్, అటెండర్‌లను సస్పెండ్ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు డిమాండ్ చేశారు. చిన్నబోనాల గురుకుల పాఠశాల ఎదుట ఏబీవీపీ జిల్లా కమిటీ అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ కార్యదర్శి ఎనుగందుల శ్రీనివాస్, పూసాల కార్తీక్, గణేష్, పాకచరణ్ పాల్గొన్నారు.

● అవీఇవీ

నేడు హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ పరిధిలోని భారత్ టాకీస్ రోడ్ వీరాంజనేయస్వామి ఆలయ హుండీలను బుధవారం ఉదయం 10 గంటలకు, మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను మధ్యాహ్నం 12 గంటలకు లెక్కించనున్నట్లు ఈవో నాగారపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఆలయాల సిబ్బంది విధిగా పాల్గొనాలని, ఔత్సాహిక భక్తులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

భగత్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-2 డిపో పరిధిలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన లభించింది. కరీంనగర్-2 డిపో పరిధిలోని గ్రామాల ప్రయాణికులు 11 మంది ఫోన్ చేశారు. ప్రయాణికుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను పరిశీలిస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని కరీంనగర్-2 డిపో మేనేజర్ మల్లయ్య తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

భగత్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపల్లి చిన్నగుట్టపై వెలసిన భూదేవి శ్రీదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కరీంనగనర్ రూరల్ మండలం చేగుర్తి యూపీఎస్ పాఠశాల విద్యార్థులు వరల్డ్ స్పారో డే సందర్భంగా ప్రతిభ చాటారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన నెస్ట్ మేకింగ్‌లో బి.సమీర, పోస్టర్ మేకింగ్‌లో రితిక, డ్రాయింగ్‌లో కార్తిక్ రాణించారు. విద్యార్థులను హెచ్‌ఎం రమేష్, శిక్షకుడు కన్నయ్య అభినందించారు.

ఎరువుల వాడకంపై అవగాహన

మానకొండూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగిపల్లి గ్రామంలో ధనలక్ష్మీ ధాన్య విత్తన రైతు పరస్పర సహకార సంఘంలో మంగళవారం ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మీ, ఏడీఏ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి శ్రినివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేదలకూ వర్తింపజేయాలి

కరీంనగర్ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అగ్రవర్ణ కులాల్లోని పేద యువతకు కూడా వర్తింపజేయాలని ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్ రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అగ్రవర్ణ కులాల్లోని పేదలకు వర్తింపజేయకపోవడంతో వారు తీవ్ర అన్యాయానికి గురవుతారని, పేదలందరికి ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



తెలంగాణ చౌక్‌లో సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్/గణేశ్‌నగర్ మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ప్రవేశపెట్టిన రెండు బిల్లులకు శాసన సభ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ బీసీ సెల్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా చౌక్‌లో సంబరాలు నిర్వాహించారు. జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి ఫలితమే అన్నారు. సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, నగర కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ బోనాల శ్రీనివాస్, రహ్మత్ హుస్సేన్, మాజీ హౌస్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రావణ్ నాయక్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు శ్రీమతి చర్ల పద్మ, డీసీసీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్ కుమార్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● యువజన కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు పంజాల కృపాసాగర్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు మాడుగుల ప్రవీణ్, జాప శ్రవణ్, సిటీ అధ్యక్షులు ఉప్పరి విశాల్, రూరల్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, కొత్తపల్లి మండల అధ్యక్షుడు సందీప్ పాల్గొన్నారు.

కరీంనగర్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో సంక్షేమ పథకాన్ని ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి బాబు ఆధ్వర్యంలో కార్ఖానగడ్డలోని గాంధీ విగ్రహం వద్ద మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్ నాయక్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలుపుతూ తెలంగాణ చౌక్‌లో సంబరాలు నిర్వహించారు.

మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లుపై ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా పలువురు దళిత శాసన సభ్యులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రాత్మకమైన ఘట్టంలో శాసన సభ్యుడిగా భాగస్వామ్యమైనందుకు గర్వపడుతున్నట్లు చెప్పారు.

అన్ని మున్సిపాలిటీల్లో ఆస్తిపన్నుపై వడ్డీ మాఫీ చేయాలి

కరీంనగర్ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీకి వడ్డీ మాఫీ పథకాన్ని వర్తింపజేస్తూ జీవో 109 విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో అమలు చేయాలని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మంకమ్మతోటలోని బీఆర్‌ఎస్ నగర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏటా మార్చిలో సామాన్యులు, పేద కుటుంబాలపై వడ్డీ భారం పడకుండా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో వడ్డీ మాఫీ పథకాన్ని అమలు చేసిందని, దీంతో వడ్డీలేకుండా ఆస్తిపన్నులు చెల్లించడంతో మున్సిపాలిటీల్లో 95శాతం మేరకు పన్నులు వసూలయ్యేవని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆరె రవి, చేతి చంద్రశేఖర్, జెల్లోజి శ్రీనివాస్, బొనకుర్తి సాయికృష్ణ, గంగాధర చందు, ఒడ్నాల రాజు, సత్తినేని శ్రీనివాస్, గూడెల్లి రాజ్‌కుమార్, నర్సింగరావు, నయీం పాల్గొన్నారు.

టీబీపై అప్రమత్తంగా ఉండాలి

సుభాష్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా మందులు వాడాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని మోతాజ్‌ఖాన అర్బన్ హెల్త్ సెంటర్‌లో మెట్రోసెమ్ సంస్థ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేశారు. టీబీని ప్రాథమిక దశలో గుర్తించి మందులు వాడితే సులభంగా నయమవుతుందన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లిపై ఆరోపణలు సరికాదు

కరీంనగర్ అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపణలు చేయడం సరికాదని, మరోసారి ఇలా చేస్తే సహించబోమని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన వ్యక్తికి ఎల్‌వోసీ, సీఎంఆర్‌ఎఫ్‌పై విషయ పరిజ్ఞానం లేకపోవడం బాధాకరమన్నారు. రసమయి చేస్తున్న ఆరోపణలపై కాంగ్రెస్ పక్షాన బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. గతంలో రసమయి బాలకిషన్ ల్యాండ్, సాండ్, రియల్ ఎస్టేట్ మాఫియాతో వేలకోట్ల రూపాయలు సంపాదించి ఫామ్‌హౌస్‌లు కట్టుకున్న మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు రమేష్, సాయిలు, రవీందర్, రమేష్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

భగత్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ ఎన్నికలే లక్ష్యంగా సీపీఐ కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో పైడిపల్లి రాజు అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ శాఖ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. నగరంలోని 60 డివిజన్లలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసేవిధంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పని చేయాలన్నారు. కార్యదర్శులు కిన్నెర మల్లమ్మ, న్యాలపట్ల రాజు, నలువాల సదానందం, సాయివేణి రాయమల్లు పాల్గొన్నారు.

బొమ్మ వెంకన్న సేవలు మరువ లేనివి



బొమ్మ వెంకన్న విగ్రహానికి పూల మాల వేస్తున్న చల్ల హరిశంకర్

కరీంనగర్ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపుల అభివృద్ధికి బొమ్మవెంకన్న చేసిన సేవలు మరువ లేనివని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ అన్నారు. మంగళవారం బొమ్మ వెంకన్న వర్ధంతి సందర్భంగా బొమ్మకల్‌లోని మున్నూరుకాపు వసతి గృహంలో విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మున్నూరు కాపులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు వెంకన్న ఎంతో కృషి చేశారన్నారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకుడు పురమల్ల శ్రీనివాస్, విద్యార్థి వసతి గృహం ట్రస్టు చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సంఘం అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ, కర్ర రాజశేఖర్, రవీందర్, శ్రీనివాస్, వేణు, నర్సన్న, సంపత్, సతీష్, బాలకృష్ణ, కర్ర సూర్య శేఖర్, సునీల్, ఆగయ్య, మహేందర్, పనిత తదితరులు పాల్గొన్నారు.

ప్యారడైజ్‌లో పవర్‌కిడ్స్ గ్రాడ్యుయేట్ డే



వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

భగత్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సిబిఎస్ఈ) పాఠశాలలో మంగళవారం ప్యారడైజ్ పవర్‌కిడ్స్ విద్యార్థుల గ్రాడ్యుయేట్ డే వేడుకలు నిర్వహించారు. వేడుకలను రోహన్ హాస్పిటల్ ఫెర్టిలిటి స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీదేవి, సంఘ సేవకర్త పనిత, పాఠశాల చైర్మన్ డాక్టర్ పాతిమారెడ్డి ప్రారంభించారు. అనంతరం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పాఠశాల ఇన్‌చార్జి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన మున్సిపల్ కమిషనర్

కరీంనగర్ క్రైం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన గౌస్ ఆలంను మంగళవారం కరీంనగర్ కమిషనరేట్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా జైలు సూపరింటెండెంట్ విజయ్ డేని, జైలర్ రమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాహిదా, డాక్టర్ సనా, ఎంసీమెచ్ ప్రోగ్రాం అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

గణేశ్‌నగర్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో చేరాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ సూచించారు. 2025-26విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ప్రచారంలో భాగంగా కళాశాల అధ్యాపకులు ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద మంగళవారం విద్యార్థులకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో అత్యుత్తమ బోధన అందజేస్తున్నట్లు చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌లు పి.నితిన్ పాఠక్, టి.రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సురేందర్ రెడ్డి, సీఈవో డాక్టర్ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్‌ను కలిసిన టీఎన్‌జీవో నాయకులు

కరీంనగర్ క్రైం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న గౌస్ ఆలంను ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. టీఎన్జీవోల జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, మహేష్, పట్టణ అధ్యక్షులు రాజేష్, భరద్వాజ్, కర్ణాకర్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యదర్శి శంకరయ్య పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

గణేశ్‌నగర్, మార్చి18 (ఆంధ్రజ్యోతి) :బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ శాసనసభలో రెండు బిల్లులకు ఆమోదం తెలపడంపై బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి తెలంగాణ చౌక్‌లో క్షీరాభిషేకం చేశారు. బీసీ రిజర్వేషన్ల 42 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పోరాట ఫలితంగా సాధ్యమైందన్నారు.బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కనకయ్యగౌడ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారాజు రాకేష్ చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం, పండ్ల పంపిణీ

కరీంనగర్ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హౌసింగ్ బోర్డుకాలనీ వీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు రావూస్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు మంగళవారం అన్నదానం, పండ్ల పంపిణీ చేపట్టారు. పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు, సీఈవో నిధిన్‌రావు, ప్రిన్సిపాల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం చరిత్రాత్మకం

కరీంనగర్ అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణ బిల్లు ఆమోదం చరిత్రాత్మకమైందని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.

గంగాధర వారసంత వేలం వాయిదా

గంగాధర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గంగాధర వారసంత వేలం వాయిదా పడింది. మంగళవారం గంగాధర గ్రామ పంచాయతీలో గ్రామ ప్రత్యేకాధికారి,ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వారసంత వేలం నిర్వహించడానికి సమావేశం నిర్వహించారు. వేలం పాట పాడడానికి అధికారులు సిద్ధమవ్వగా పాల్గొనడానికి ముందు రోజు ఇచ్చిన సమయం దాటిన తరువాత ఎలా తీసుకుంటారని అధికారులను ప్రశ్నించారు. జమ్మికుంట, హుజూరాబాద్ వంటి సంతల్లో పశువు, గొర్రె,మేకకు ఒక ధర ఉంటే ఇక్కడ తక్కువగా పెట్టారని టెండర్ దక్కించుకున్న వారు నష్టపోతున్నామని అధికారులకు తెలిపారు. వేలం పాట ప్రారంభించగా రుద్రాక్ష హరికిషన్ రూ.50లక్షలు పలికారు రెండు గంటలైన వేలం పాట ముందుకు సాగకపోవడంతో వేలం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించారు. గతంలో వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్లు నష్టపోయామని ఎగ్గొట్టిన 30లక్షలు ఎలా మాఫీ చేస్తారని ప్రశ్నించారు. కాంట్రాక్టు నియమ నిబంధనలు పాటించడంలేదని అధికారు లను నిలదీశారు. ఇలా మాఫీ చేస్తామంటే ప్రతి ఒక్కరూ టెండర్ వేసి ప్రభుత్వం నిర్ణయించినదాని కంటే ఎక్కువ పాడుతామని సభలో అధికారులకు తెలిపారు.

మహనీయుల విగ్రహాలు ఆవిష్కరించాలి

తిమ్మాపూర్, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): బీఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలను ఆవిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ మేయర్ వై.సునీల్‌రావు డిమాండ్ చేశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆవిష్కరించాలని డిమాండ్ చేస్తూ 10 రోజులుగా తిమ్మాపూర్ మండల జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షకు మంగళవారం సునీల్‌రాబు మద్దతు తెలిపారు. జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి : మాజీ సర్పంచ్ ఆవేదన

శంకరపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా- గ్రామాభివృద్ధికి ఖర్చుపెట్టిన పెండింగ్ బిల్లులు రావడం లేదని కేశవపట్నం మాజీ సర్పంచ్ మోతుక్కూరి సమ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కేశవపట్నంలో తనకు రావాల్సిన పెండింగ్ బిల్లుల చిట్టా ను ఫ్లెక్సీపై ముద్రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధి కారుల చుట్టూ తిరిగినా, వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేద న్నారు. త్వరలోనే ఫ్లెక్సీలను గ్రామంలో ప్రదర్శిస్తానన్నారు. వివిధ అభివృద్ధిపనులు చేపట్టిన తనకు మొత్తం రూ.9.20 లక్షలు రావాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయాలి

సుభాష్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ ప్రకారమే నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాల భర్తీ జరిగితే మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రుద్రారపు రాంచందర్, తుంగ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నాం

సుభాష్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం నగరంలోని కోతి రాంపూర్‌లో నిర్వహించిన అత్యవసర సమావేశంలో మాట్లాడారు. ఐక్యంగా ఉన్న దళితులను విడగొట్టడానికే ఎస్సీ వర్గీకరణ చేస్తున్నారని ఆరోపించారు. కేవలం మోదీ, చంద్రబాబు శిష్యుడని నిరూపించుకునేందుకు కాంగ్రెస్ ముసుగులో ఉన్న రేవంత్‌రెడ్డి హడావుడిగా ఎస్సీ వర్గీకరణ తీర్మానం చేశారన్నారు. రాష్ట్ర కార్యదర్శి శేఖర్, రాజలింగం, రమేశ్, పవన్‌కుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు పనులు చేపట్టకపోతే ఉద్యమిస్తాం

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



గన్నేరువరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

గన్నేరువరం, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలం రాజీవ్ రహదారి గుండ్లపల్లి స్టేజీ నుంచి మండల కేంద్రం మీదుగా పొత్తూరు వరకు మంజూరైన డబుల్ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని, రోడ్డు పనులు వేగంగా చేపట్టకపోతే బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గంప వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో అంతా గోల్‌మాల్ జరుగుతుందని, ఒక చెక్కు మరొకరికి ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు రాని వారి కోసం ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి నిర్వహిస్తామని, బాధితులు ఎవరైనా ఉంటే కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంజూరు చేయించిన రోడ్డు ఇప్పటివరకు పూర్తి కాకపోవడం శోచనీయమని, కాంట్రాక్టర్ కంకర పోసి వదిలి వేయడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదన్నారు. వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని, ఈ ఉద్యమానికి అప్పటి రోడ్డు సాధన సమితి సభ్యులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాడుగుల రవీందర్, మాజీ సర్పంచ్ పుల్లెల లక్ష్మి లక్ష్మణ్, నాయకులు నేత సుధాకర్, బద్దం తిరుపతిరెడ్డి, అటికం శ్రీనివాస్, గొల్లపల్లి రవి, శ్రీనివాస్, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల వార్షికోత్సవం

వీణవంక,మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్ముక్ల తెలంగాణ ఆదర్శ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యతిధిలుగా ఎస్ఐ తోట తిరుపతి, వీణవంక కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్ హాజరయ్యారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మొయిజ్ బేగ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

● **మానకొండూర్:** మానకొండూర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాస్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

వీణవంక,మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీణవంక గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి అధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షునిగా ఒరేం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దాసారపు రాజేశంలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని మండల అధ్యక్షుడు సన్మానించారు. నాయకులు మాదాసు సునీల్, రజాక్,సాహెబ్ హుస్సేన్,మోటం శ్రీనివాస్,రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థికి కలెక్టర్ ప్రశంస

వీణవంక,మార్చి 18(ఆంధ్రజ్యోతి) మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దుర్గం ప్రహర్షను జిల్లా కలెక్టర్ సత్పతి పమేలా ప్రశంసించారు. అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో పోటీలు నిర్వహించగా నెస్ట్ మేకింగ్‌లో విద్యార్థి ప్రతిభ కనబరచగా జిల్లా కలెక్టర్ సత్పతి పమేలా అభినందించారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వొడితెల ప్రణవ్, నాయకులు

హుజూరాబాద్‌రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ నివాస గృహం ఆవరణలో అంబేద్కర్ ఫొటో సాధన సమితి నాయకులు ఆయనతో కలిసి ఛలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరుశురాం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్ మాట్లాడుతూ కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలన్నారు. ఫొటో ముద్రణ కోసం ఈ నెల 26న చలో ఢిల్లీ ధూంధాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల ప్రభాకర్, కిరణ్, వడ్లూరి విజయ్‌కుమార్, సుగుణాకర్‌రెడ్డి, మిడిదొడ్డి శ్రీనివాస్, ఎర్ర ఆదిత్యలు ఉన్నారు.

వివాదాస్పదంగా విగ్రహాల ఏర్పాటు

● విచారణ చేపట్టిన పోలీసులు

శంకరపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ముత్తారం గ్రామ వాట్సాప్ గ్రూపులో గ్రామంలో విగ్రహాల ఏర్పాటుపై ఓ వర్గం వారు సోషల్ మీడియాలో వివాదస్పద పోస్టులు పెట్టారు. దీనిపై కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ముత్తారం గ్రామానికి చెందిన వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ముత్తారం గ్రామంలో అంబేద్కర్, శివాజీ విగ్రహం ఏర్పాటుపై దళితులు బీసీ వర్గాలకు చెందిన యువకుల మధ్య వాట్సాప్ గ్రూపులో పోస్టులు పెట్టుకున్నారు. ఈ పోస్టులు కించపరిచే విధంగా ఉన్నాయంటూ దళిత సామాజిక వర్గానికి చెందిన కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్, తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎస్ఐ రవి, ఎంపీవో ప్రభాకర్‌లు వారితో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ మాట్లాడుతూ గ్రామంలో శాంతియుతంగా విగ్రహాలు ఏర్పాటు చేసుకుంటే తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వివాదస్పదంగా మారితే మాత్రం ఇరు వర్గాలను బైండోవర్ చేస్తామన్నారు. రెండు వర్గాలకు చెందిన పెద్దమనుషులు శాంతియుతంగా చర్చలు జరుపుకోవాలని సూచించారు.ఈ నెల 23న సమావేశం ఏర్పాటు చేసుకుంటామ తెలిపారు.

ఘనంగా బొమ్మ వెంకటేశ్వర్లు వర్ధంతి

సైదాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లు వర్ధంతి మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, రాజు, శ్రీనివాస్, విద్యాస్‌రెడ్డి, నవీన్, వాసుదేవ్, అశోక్, వెంకట్రాజ్యం, సురేష్, అనిల్, రాంరెడ్డి, రాహుల్, శివప్రసాద్, వెంకటేష్, రామకృష్ణ, రామ్‌కుమార్, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన

హుజూరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణ శివారులోని ఏకశిల సీబీఎస్ఐ పాఠశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు ఎక్సైజ్ ఎస్ఐలు వినోద్‌కుమార్, జుమ్‌లాల్, ప్రిన్సిపాల్ దినేష్‌రెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది ముకుందరెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు

హుజూరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు చేస్తున్న నిరసన దీక్ష మంగళవారం ఏడో రోజుకు చేరింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హుజూరాబాద్ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం బోర్నపల్లి సమీపంలో మంగళవారం రాత్రి కరీంనగర్- వరంగల్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన బాణాల భక్తిరెడ్డి హనుమాన్ మోడరన్ రైస్ మిల్ సమీపంలో ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో భక్తిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంతో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.